# యువతలో పరిశ్రమలకు కావాల్సిన నైపుణ్యాన్ని పెంపొందించాలి: ఎస్‌పి.కొచ్చార్

**గచ్చిబౌలి, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త:** చదువు పూర్తి చేసుకొని కళాశాలల్లో నుండి బయటకు అడుగుపెడుతున్న యువతలో పరిశ్రమలకు కావాల్సిన నైపుణ్యాన్ని పెంపొందించాల్సిన అవసరం ఉందని టెలికం సెక్టార్ స్కిల్ కౌన్సిల్ చీఫ్ ఎక్జిక్యూటీవ్ ఆఫీసర్ ఎస్‌పి.కొచ్చార్ పేర్కొన్నారు. టెలికం సెక్టార్ స్కిల్ కౌన్సిల్, ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా(ఎస్కీ)ల మధ్య టెలికం టెక్నికల్ అండ్ సాఫ్ట్ స్కిల్స్ ఎకో సిస్టంపై ఎంఒయు చేసుకున్నారు. ఈ సందర్భంగా బుధవారం ఎస్కీలో మొదటి శిక్షణా కార్యక్రమాన్ని కొచ్చార్ ముఖ్యఅతిధిగా హాజరై



జ్యోతి ప్రజ్వలన చేసి శిక్షణ తరగతులను ప్రారంభిస్తున్న కొచ్చార్

ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టెలికం సెక్టార్‌లో 2020 నాటికి 20మిలియన్ల ఉద్యోగాలు అందుబాటులో ఉంటాయని, యువతకు ఈ రంగంలో మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. ప్రతి సంవత్సరం లక్షలమంది విద్యార్థులు చదువు పూర్తి చేసుకొని కళాశాలల నుడి బయటకు వస్తున్నారని, కానీ వారిలో ఇండస్ట్రీకి కావాల్సిన నైపూణ్యం ఉండడం లేదన్నారు. దీని కారణంగా వేల ఉద్యోగాలు ఇండస్ట్రీలలో ఖాళీగా ఉంటే బయట వేల మంది యువత ఉద్యోగాలు లేక నిరుద్యోగులుగా ఉంటున్నారన్నారు. ఈ అంతరాన్ని తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఎన్‌హెచ్‌డిసి కౌన్సిల్ ద్వారా స్టాండర్డ్ ట్రెనింగ్ అసెస్‌మెంట్ అండ్ రివార్డ్(స్టార్) స్కీం ద్వారా యువతకు నైపూణ్య శిక్షణ అందిస్తున్నామన్నారు. ఎస్కీ డైరెక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా యువతలో ఇండస్ట్రీకి కావాల్సిన నైపూణ్యాన్ని పెంపొందించడంతో పాటు జాతీయ స్థాయిలో ఉద్యోగం సాధించే విధంగా తీర్చిదిద్ద వచ్చాన్నారు. 10వ తరగతి పూర్తి చేసిన 18 నుండి 25 సంవత్సరాల వయసు గల వారు అర్హులని, ఎటువంటి ఫీజు లేకుండా 120 గంటల శిక్షణ అందజేస్తామన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి జాతీయ స్థాయి అసెస్‌మెంట్ పరీక్ష నిర్వహించి, ఉత్తీర్ణులైన వారికి సర్టిఫికేట్లు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు రామక్రిష్ణ, ధర్మరాజు, స్వామిలతో పాటు టెలికం రంగంలోని వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.